పట్టించుకోండి కూ'సంత'..

రహదారుల పక్కనే వారపు సంతల నిర్వహణ

- స్థలం కేటాయింపులో పంచాయతీ నిర్లక్ష్యం
- అందుబాటులోలేని నీరు, మరుగుదొడ్లు
- వసతుల కన్నా ఆదాయంపైనే పాలకవర్గం దృష్టి


జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తున్న సారపాక సంత


రాష్ట్రీయ రహదారి పక్కన బూర్గంపాడు సంత

బూర్గంపాడు: వారపు సంతలతో ఆదాయం పెంచుకుంటున్న గ్రామపంచాయతీలు వసతుల కల్పన మాత్రం గాలికి వదిలేశాయి. సంతల నిర్వహణతో ఏటా రూ.లక్షలు ఆదాయం తీసుకుంటున్న గ్రామ పంచాయతీలు నిర్వహణకు కనీసం స్థలాలను కూడా చూపడం లేదు. పారిశ్రామిక ప్రాంతమైన సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీ ఆదివారం నిర్వహించే సంత జాతీయ రహదారి పక్కన కొనసాగుతోంది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కన సంత నిర్వహణ ఎంతో భయాందోళనలకు గురిచేస్తోంది. రోడ్డుపక్కనే దుకాణాలు ఏర్పాటు చేయటంతో కూరగాయలు, పండ్లు వంటి నిత్యావసరాలను కొనుగోలు చేసేందుకు వచ్చేవారు రోడ్డుపై నిలబడి వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితులున్నాయి. ఇప్పటికే పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడిన ఘటనలున్నాయి. మరోవైపు వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి.

వసతుల కల్పనపై నిర్లక్ష్యం

సంత వేలం పాటల ద్వారా ఆదాయం సమకూర్చుకునే పాలకవర్గం.. రోడ్డు పక్కన సంతలకు వసతి కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని అటు వ్యాపారులు, ఇటు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీంతోపాటు సంతలో వెలుతురు కోసం వ్యాపారులే చార్జింగ్ లైట్లు తెచ్చుకుంటారు. సంతలో కనీసం తాగునీటి వసతి కానీ మరుగుదొడ్లు కానీ లేవు. దీంతో మహిళా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి పక్కనే సంత నిర్వహణతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ముధూళి లేచి వ్యాపారులు, ప్రజలు రోగాల పాలవుతున్నారు. రోడ్డు పక్కన దుకాణం పెట్టుకున్న వ్యాపారుల వద్ద నుంచి సంత వేలంపాట దక్కించుకున్న కాంట్రాక్టర్ వారం వారం ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. వసతుల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఓ పక్క వసతులు లేకుండా, మరో పక్క ప్రమాదభరితంగా ఉన్న జాతీయ రహదారిపై వ్యాపారాలు చేయాలంటే చిరువ్యాపారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. అదే సమయాన సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తున్న ప్రజలు కూడా ఆందోళనలకు గురవుతున్నారు. అటు గ్రామపంచాయతీ గాని, ఇటు పోలీస్‌శాఖ గాని జాతీయ రహదారి పక్కన దుకాణాల నిర్వహణ ప్రమాదకరమని తెలిసినా ఎలాంటి పట్టింపులు లేకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈసారి సంత వేలంపాట నిర్వహణ సమయంలో సంత నిర్వహణ స్థలం, వసతులపై గ్రామపంచాయతీ అధికారులను నిలదీయాలని పలువురు వేచిచూస్తున్నారు.

బూర్గంపాడులోనూ అంతే..

మండల కేంద్రమైన బూర్గంపాడులో బుధవారం నిర్వహించే వారపు సంత కూడా రాష్ట్రీయ రహదారి పక్కనే జరుగుతోంది. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు దుకాణాలు పెడుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ రహదారిలో బస్సులు, లారీలు, ఇసుక ట్రాక్టర్లు, కర్ర ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. సంత నిర్వహించే బుధవారం రోజున ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో కర్ర ట్రాక్టర్ బోల్తాపడి సంతకు కూరగాయలు కొనేందుకు వచ్చిన ఓ మహిళ మృతిచెందింది. ఇలాంటి ఘటనలు మరికొన్ని ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. ఈ సంతలో కూడా తాగేందుకు నీళ్లు లేవు. మరుగుదొడ్లు లేవు. ఎలాంటి వసతులు లేవు. బూర్గంపాడు సంత నిర్వహణకు కూడా ప్రత్యేక స్థలం చూడాలని, వసతులు మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగే అవకాశాలు..



సారపాక, బూర్గంపాడు, నాగినేనిప్రోలు వారపు సంతలు రోడ్డుపక్కనే నడుస్తుండటం చాలా ఇబ్బందికరంగా ఉంది. వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డుపక్కన కాకుండా వేరేచోట్ల సంత నిర్వహణకు చర్యలు తీసుకోవాలి.

–ఎస్‌కే పాషా, బూర్గంపాడు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం



సారపాక సంత నిర్వహణకు ప్రత్యామ్నాయ స్థల పరిశీలన చేస్తున్నాం. జాతీయ రహదారి పక్కన దుకాణాలు నడపొద్దని హెచ్చరిస్తున్నాం. వ్యాపారులు రోడ్డు పక్కన షాపులు పెట్టవద్దని చెబుతున్నా అక్కడే పెడుతున్నారు. జాతీయ రహదారి పక్కన దుకాణాలు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం.

–మహేశ్, ఈఓ, సారపాక

క్లుప్తంగా

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: వేసవి, ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిశారు. రానున్న మూడు నెలలు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నందున అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా పబ్లిక్ ప్రదేశాలలో చలివేంద్రాలతోపాటు రాగి జావ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు నారం రాజశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్ ఉన్నారు.

దాహార్తి తీర్చేందుకు చర్యలు


ట్యాంకర్‌తో నీరు నింపుతున్న అధికారులు

అశ్వాపురం: వేసవి కారణంగా ముందస్తుగా జీవుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో తుమ్మలచెరువు, సత్యనారాయణపురం, అశ్వాపురం, గొందిగూడెం, కృష్ణసాగర్‌తో పాటు పలు బీట్ల పరిధిలో మంగళవారం అటవీ ప్రాంతంలో అధికారులు నీటి తొట్లలో ట్యాంకర్లతో నీరు నింపారు.

బీజేపీలో చేరిక

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మడవి రవి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా చేరినవారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలోని రెండు పోలింగ్ బూత్‌లకు కమిటీలను నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌వీటీ కొండ, జక్కుల అర్జున్, చందా నాగేశ్వరరావు, చందా రామారావు, ముత్యాల శ్రీనివాసరావు, రాయల పోలయ్య, డి.నరేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'నవోదయ'లో సత్తా చాటిన విద్యార్థులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం మడోన్నా ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు తేజశ్రీ, రిషిత్, వెంకటసాయి జశ్వంత్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమని పేర్కొన్నారు.

ల్యాప్‌టాప్ గెలుచుకున్న విద్యార్థి

మణుగూరురూరల్: ఐఎస్‌టీఎస్‌ఓ లెవెల్–2 పరీక్షలో గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి శ్రేయస్‌రాజ్ ప్రతిభ కనబర్చి ల్యాప్‌టాప్ గెలుచుకున్నాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్‌ఎం యుగంధర్, ఏజీఎం జయప్రకాష్, వెంకట్, నరేశ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

మణుగూరురూరల్: పల్లె దవాఖానాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కాంట్రాక్ట్ వర్కర్లకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు పీహెచ్‌సీ వద్ద ఎంఎల్‌హెచ్‌పీ వర్కర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల్లో ఎంఎల్‌హెచ్‌పీ కాంట్రాక్ట్ వర్కర్లు ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నా వారిని ప్రతీ నెల జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. సమావేశంలో ప్రియభారతి, ఎస్.వెంకటలక్ష్మీ, హిమబిందు, మనీషా, విజయబాబు, మనీషా, సువర్ణ, లక్ష్మీ, నాగమణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ ఆశయ సాధనకు కృషి

మణుగూరురూరల్: తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ కేన్సర్‌తో మృతిచెందిన కిరణ్ ఆశయ సాధన కోసం పోరాడుదామని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ ఆటోఅడ్డాలో కిరణ్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవికుమార్, ఎస్‌కే సలీంపాషా, జె.రాజు, ఎ.మహేశ్, టి.రాము, పి.సునీల్‌కుమార్, ఎండీ సోయల్, కె.విజయ్, కె.సాధిక్‌పాషా పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి మంగళవారం ఇక్కడ ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కొందరు పూనకాలతో ఊగిపోయారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శాంతి

మణుగూరురూరల్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్థానిక పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శాంతి మాట్లాడుతూ.. అనవసరంగా వచ్చే మెసేజ్‌లను, లింకులను ఓపెన్ చేయొద్దని, బ్యాంకు సిబ్బంది అంటూ ఎవరైనా వివరాలు, ఓటీపీలు చెప్పమంటే సమాచారం ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నిజాం అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం..

అశ్వాపురం: ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ భారీ బహిరంగ సభ విజయవంతానికి బుధవారం మణుగూరులో అంబేడ్కర్‌సెంటర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు సన్నాహక సభ జరగనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేశ్, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేశ్ మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

ఓటు హక్కుపై అవగాహన



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి


చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: ఓటు హక్కుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి, ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంభద్రయ్య, పంచాయతీ సెక్రటరీ ఖాదర్, పంచాయతీ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ: ఓటు హక్కు వినియోగంపై మండలంలోని అన్ని పంచాయతీల్లో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

మణుగూరులో..

మణుగూరురూరల్: ఓటు హక్కు ప్రాముఖ్యతపై మణుగూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఐకేపీ మహిళలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ అహ్మదుల్లా, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్గురు ఆశ్రమంలో ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ములకలపల్లి: రామచంద్రాపురం గ్రామంలోని శ్రీసద్గురు ఆశ్రమం అచటపీఠంలో విశ్వేశ్వర స్వామి (మరకత లింగం) ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈక్రతువుకు అచలపీఠం వ్యవస్థాపకులు ప్రబోధానంద గాజర్ల వీరభద్రం సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలిరోజైన మంగళవారం విశ్వధర్మక్షేత్ర వ్యవస్థాపకులు, గాయత్రీ ఉపాసకులు వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సాయంత్రం జలాధివాసం, రాత్రి మహానైవేద్యం, మంత్రపుష్ప నీరాజనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పూజా కార్యక్రమాల్లో భక్తులు భారీగా హాజరయ్యారు. హోమం కార్యక్రమంలో ఎవరైనా పాల్గొనవచ్చని నిర్వాహకులు చెప్పారు.

వేసవిలో జాగ్రత్తలు అవసరం..


మాట్లాడుతున్న డాక్టర్ మణిదీప్

దమ్మపేట: వేసవి కాలం దృష్ట్యా విధులు నిర్వర్తించే సమయంలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మణిదీప్ ఆశ వర్కర్లకు సూచించారు. ఆశా డే సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కూలీలు, సామాన్య ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకొని, వడదెబ్బ తగిలిన వారికి వెంటనే అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామారావు, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, మతోన్మాదులను ఓడిద్దాం..


మాట్లాడుతున్న కెచ్చెల రంగారెడ్డి

చర్ల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పాటు మతోన్మాద బీజేపీలను ఓడిద్దామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, రాష్ట్ర నాయకుడు ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని డీవీకే హాల్‌లో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అవినీతికి అడ్డాగా ఉన్న బీఆర్‌ఎస్‌ను.. మతోన్మాదానికి నాందిగా ఉన్న బీజేపీలను ఓడించాలని, కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మత పిచ్చి పెచ్చుమీరి ఘర్షణలు మరింతగా పేట్రేగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ ఈ రెండు పార్టీలకు ఓటెయ్యొద్దని సూచించారు. అనంతరం మండలంలో పార్టీలో క్రియాశీలంకంగా పనిచేస్తూ.. మీడియా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న కొండా కౌశిక్‌ను పార్టీ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొండా కౌశిక్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పోరాటాలు సాగిస్తానని తెలిపారు. సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కొండా చరణ్, నాయకులు దాసరి సాయన్న, సిమిడి సుజాత, బోడా సందీప్, రెడ్డి, ఉబ్బిడి నగేశ్, మొహమద్ పాల్గొన్నారు.

ఆరని మంటలు..

కలగానే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

- నియోజకవర్గవ్యాప్తంగా ఒకే ఒక్క అగ్నిమాపక కేంద్రం
- అగ్ని ప్రమాదాల్లో కాలి బూడిదవుతున్న ఇళ్లు, ఇతర సామగ్రి
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు (ఫైల్)

చర్ల: మండలంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణం కలగానే మిగులుతోంది. నియోజకవర్గవ్యాప్తంగా భద్రాచలంలో ఒకే ఫైర్‌స్టేషన్ మాత్రమే ఉంది. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎక్కడ అగ్నిప్రమాదం సంభవించినా భద్రాచలంలోని అగ్నిమాపక కేంద్రం నుంచి మాత్రమే ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పాల్సిన పరిస్థితి ఉంది. భద్రాచలం నుంచి చర్ల, దుమ్ముగూడెం మండలాలకు ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పేలోపు ఇళ్లు, గడ్డివాములు, ఇతర ఆస్తులన్నీ కాలిబూడిదవుతున్నాయి. భద్రాచలం నుంచి చర్ల శివారు సుబ్బంపేటకు 65 కిలోమీటర్లు, పూసుగుప్పకు 70 కిలోమీటర్లు, చెన్నాపురానికి 80 కిలోమీటర్లు, కుర్నపల్లికి 55 కిలోమీటర్లు, దుమ్ముగూడెం మండలంలోని ములకనాపల్లికి 40 కిలోమీటర్లు, పైడిగూడెంనకు 50 కిలోమీటర్లు, మారాయిగూడెంనకు 40 కిలోమీటర్ల చొప్పున దూరం ఉంటుంది. ఈ రెండు మండలాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా భద్రాచలం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చే సరికి కనీసం గంట నుంచి గంటన్నర సమయం పడుతోంది. ఈ లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఇళ్లు, ఆస్తులు కాలిబూడిదైన తరువాత వచ్చిన ఫైర్‌ఇంజన్ చివరి మంటలను ఆర్పివెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. గతంలో పలు సందర్భాల్లో స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు ప్రభుత్వాలకు ఎంతగా విన్నవించినప్పటికీ పట్టించుకోకుండా కాలం దాటవేశారని దీంతో ఏళ్ల తరబడి ఆస్తులు బుగ్గిపాలవుతూనే ఉన్నాయని ఏజెన్సీవాసులు ఆవేదన చెందుతున్నారు.

చర్లలో ఏర్పాటు చేస్తే మేలు..

చర్ల, దుమ్ముగూడెం మండలాలకు అనుకూలంగా ఉండేందుకు చర్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ రెండు మండలాలకు ఎంతగానో ఉపయోగం ఉంటుంది. చర్ల మండల కేంద్రం నుంచి ఎటు చూసినా శివారు గ్రామాలకు 20 నుంచి 25 కిలోమీటర్లు దూరం ఉండగా పక్కనే ఉన్న దుమ్ముగూడెం మండలం కూడా సగ భాగం చర్ల మండలానికి చేరువలో ఉంటుంది. ఈ నేపథ్యంలో చర్ల మండలంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా ఆ ప్రాంతానికి ఫైర్ ఇంజన్ 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో చేరుకొని మంటలను ఆర్పేందుకు అనుకూలంగా ఉంటుంది.

మూడేళ్లలో సంభవించిన అగ్నిప్రమాదాలు..

- మండలంలోని సుబ్బంపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా బాధిత కుటుంబానికి రూ.3.50 లక్షలు నష్టం వాటిల్లింది.
- మండలంలోని సింగసముద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా ఇంట్లోని ధాన్యం, బంగారం, ఇతర సామగ్రితో సహా మొత్తం కాలిపోయాయి. రూ.6 లక్షల మేర నష్టం సంభవించింది.
- మండలంలోని దానవాయిపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల మేర నష్టం జరిగింది.
- మండలంలోని దానవాయిపేటలో చర్చికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా, రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లింది.
- మండలంలోని దానవాయిపేటలో మిర్చి కల్లానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించడంతో గిరిజన రైతుకు చెందిన 18 క్వింటాళ్ల మిర్చి దగ్ధమైంది. సుమారు రూ.3.60 లక్షల మేర నష్టం వచ్చింది.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



చర్ల మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగితే భద్రాచలం నుంచి ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పే సరికి బూడిద మాత్రమే మిగులుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

పి.సాంబశివరావు, ఆర్.కొత్తగూడెం

చర్లలో ఏర్పాటు చేయాలి



ఏటా జరుగుతున్న అగ్ని ప్రమాదాలలో లక్షలాది రూపాయల ఆస్తి కాలిబూడిదవుతుండగా పేదలు, గిరిజనులు నిరాశ్రయులవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి చర్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

–సాయికుమార్, తేగడ

గంజాయి, మద్యాన్ని అరికట్టాలి..


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఇటీవల గంజాయి, మద్యం అమ్మకాలు పెరుగుతున్నందున పోలీసులు నిఘా పెంచి అరికట్టాలని, మద్యం బెల్టు షాపులను సైతం మూయించాలని సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల భద్రాచలంలోని పలుకాలనీల్లో యువత గంజాయి, మద్యానికి బానిసవుతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నందున పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, కె.బ్రహ్మాచారి, జీఎస్ శంకర్‌రావు, బీబీజీ తిలక్, వై.వెంకటరామారావు, పి.సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి, ఎర్రంశెట్టి పూర్ణాదేవి, జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత


బాధితులతో సీఐ సతీశ్‌కుమార్

మణుగూరురూరల్: పోగొట్టుకున్న, అపహరణకు గురైన ఫోన్లను తిరిగి బాధితులకు అందజేసినట్లు మణుగూరు సీఐ సతీశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్ల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా బాధితుల ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. ఆయా ఫోన్ల ఆచూకీ కోసం కానిస్టేబుల్ బుచ్చిబాబు, వెంకట్ గాలింపు చర్యలు చేపట్టారని, పోర్టల్‌లో నమోదు చేసిన ఫోన్ వివరాల ఆధారంగా వాటిని కనుగొని స్వాధీనం చేసుకున్నామని, తర్వాత బాధితులకు అందజేశామని వివరించారు. ఎవరైనా ఫోన్లను పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే.. వాటిని కనుగొని బాధితులకు అందజేస్తామని చెప్పారు. అనంతరం కానిస్టేబుళ్లు బుచ్చిబాబు, వెంకట్‌ను మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, సీఐ సతీశ్‌కుమార్ అభినందించారు.